మెగా జాబ్ మేళాకు స్పందన



ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేస్తున్న కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక: మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక నోవెల్ ఇన్ఫోటెక్‌లో గురువారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. సుమారు పది కంపెనీలు పాల్గొన్న ఈ జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు బీజేపీ కన్వీనర్ కరణం రెడ్డి నరసింగరావు నియామక పత్రాలు అందజేశారు. 500 మంది అభ్యర్థులు పాల్గొన్న జాబ్ మేళాలో 300 మంది ఎంపికైనట్టు నిర్వాహకులు తెలిపారు. అవినాష్, సంతోష్, రాజు, పేర్ల అప్పారావు, రంజిత్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

పెదగంట్యాడ: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కార్మిక సంఘం నాయకుడు ఎస్.రామారావు కోరారు. పెదగంట్యాడ సీడబ్ల్యూసీలో పెన్షనర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు కనీస పింఛన్ రూ.9 వేలు ఇవ్వాలని కోరారు. కణితి అప్పలరాజు, పులి వెంకట రమణారెడ్డి, దీనబంధు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకోవాలి

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక సంక్షోభం, ముడి సరుకుల కొరత నివారణకు తక్షణం ఆదుకోవాలని ఉక్కు అధికారుల సంఘం (సీ) ప్రధానకార్యదర్శి కె.వి.డి. ప్రసాద్ కేంద్ర ఉక్కు కార్యదర్శి సందీప్ పౌండ్రిక్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ సంజయ్‌రాయ్‌లను కోరారు. గురువారం ఆయన స్టీల్ ఎగ్జిక్యూటివ్ ఫెడరేషన్ చైర్మన్ నరేంద్రకుమార్ బంచోర్, ఉప ప్రధాన కార్యదర్శి నరేంద్ర సింగ్‌లతో న్యూఢిల్లీలో వారిని కలిసి వినతిపత్రాలు అందజేశారు. పోర్టులో నిలిచిపోయిన బొగ్గును విడిపించడానికి తగిన ఆర్థిక సాయం చేయాలని కోరారు.

'ఉక్కు' సీఎండీపై చర్యలు తీసుకోవాలి'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రస్తుత పరిస్థితికి కారకులైన సీఎండీపై చర్యలు తీసుకోవాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. యూనియన్ పాయింట్ వద్ద నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎండీగా అతుల్ భట్ బాధ్యతలు చేపట్టాక లాభాల్లో ఉన్న కంపెనీని పూర్తిగా భ్రష్టు పట్టించి నష్టాలు బాట పట్టించారని ఆరోపించారు. సీఎండీ భట్ వ్యవహారంపై, రా మెటీరియల్ ఉత్పత్తి, అమ్మకాలపై ప్రభుత్వ దర్యాప్తు సంస్థలతో ఆడిట్ చేయించి కర్మాగారాన్ని రక్షించాలని డిమాండ్ చేశారు. రాజు, ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

గురువులే సమాజ రూపకర్తలు

నియోజకవర్గంలో ఘనంగా గురుపూజోత్సవం



చిట్టినాయుడు కాలనీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కిరణ్మయిని సత్కరిస్తున్న కార్పొరేటర్ చందు తదితరులు

గాజువాక: గురుపూజోత్సవాన్ని గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు నివాళులర్పించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు ప్రసంగిస్తూ రాధాకృష్ణన్ అందించిన సేవలను కొనియాడారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న ఫిజికల్ డైరెక్టర్ రత్నం, హిందీ పండిట్ సూర్య కుమారిని, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ ప్రశాంతిని ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనార్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● జీవీఎంసీ 70వ వార్డులోని చిట్టినాయుడు కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కిరణ్మయిని సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసరాజు, సతీష్, స్థానిక నాయకులు పాలఘాట్ కృష్ణ, నీలకంఠం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ గురువులకు సత్కారం

అక్కిరెడ్డిపాలెం: ఉత్తమ ఉపాధ్యాయినిగా 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, ఉత్తమ ఉపాధ్యాయునిగా మింది హైస్కూల్‌కు చెందిన బి.హెచ్.వి.ఎస్.ఎస్.ఎస్.ఎస్.త్రినాథరావు జిల్లా స్థాయిలో పురస్కారం అందుకున్నారు. నగరంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్, ఎంపీ భరత్, మేయర్ హరివెంకట కుమారి, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి చేతుల మీదుగా వారు ప్రశంసాపత్రాలను అందుకున్నారు.



గాజువాక హైస్కూల్‌లో కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు తదితరులు

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సత్కారం

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు మంగళపాలెం ప్రాథమిక పాఠశాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసిన ప్రధానోపాధ్యాయుడు రుత్తల శ్రీనివాసరావును కలెక్టర్ సత్కరించడం అభినందనీయమని 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి కొనియాడారు. అగనంపూడిలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రుత్తల శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 33 ఏళ్లపాటు సేవలు అందించిన శ్రీనివాసరావు మాస్టార్‌ను ఉత్తమ గురువుగా ప్రభుత్వం గుర్తించడం సంతోషంగా ఉందన్నారు. ఓవైపు విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దడం, మరోవైపు తల్లిదండ్రులు, గ్రామస్తులతో కలిసి పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునందించారన్నారు. సన్మాన గ్రహీత రుత్తల శ్రీనివాసరావు మాట్లాడుతూ చేసిన వృత్తికి న్యాయం చేయడంలో ఉన్న ఆనందం, సంతోషం ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నేతలు బలిరెడ్డి సత్యనారాయణ, కోసూరి తాతారావు, బుదిరెడ్డి అప్పారావు, బండారు చందు రమేష్ పాల్గొన్నారు.



అవార్డులు పొందిన గాజువాక హైస్కూల్ ఉపాధ్యాయినులు

పెదగంట్యాడ: సమాజానికి మార్గదర్శకుడు ఉపాధ్యాయుడు అని పెదగంట్యాడ శాఖ గ్రంథాలయాధికారి పి.వెంకటరమణ అన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పాఠకులతో కలిసి గురువారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎనలేని గౌరవం ఉందన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ విద్యా రంగంలో రాణించాలని సూచించారు.

నడుపూరు హైస్కూల్లో నలుగురు ఉపాధ్యాయులకు పురస్కారం

పెదగంట్యాడ: నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న నలుగురు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వారికి కలెక్టర్ హరేందిర ప్రసాద్ పురస్కారాలు అందించారు. పాఠశాలకు చెందిన సీనియర్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని రాజాన మంగమ్మ, గణిత ఉపాధ్యాయుడు కస్తూరి సూర్యకిరణ్, ఇంగ్లిష్ ఉపాధ్యాయిని తోనంగి వెంకటలక్ష్మి, ఆర్ట్ ఉపాధ్యాయుడు పెద్దాడ నూకరాజు పురస్కారాలను అందుకున్నారు. వారిని హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్ అభినందించారు.



కణితి హైస్కూల్ హెచ్‌ఎంను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం, మింది జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. అక్కిరెడ్డిపాలెం హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతంకు విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ ఉపాధ్యాయులు దేముళ్లు, మాధురి, పద్మజలను ఉపాధ్యాయులు సన్మానించారు.

● అక్కిరెడ్డిపాలెం ఉపాధ్యాయులకు ఎస్ఎంసీ చైర్మన్ కనకారావు, సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. నగరంలో జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ విద్యార్థినులు రితిక, జోష్నతో పాటు ఉపాధ్యాయిని ఆర్.వేణును డీఈవో ఎల్.చంద్రకళ అభినందించారు.

సర్వేపల్లికి ఘన నివాళులు

అగనంపూడి: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 79వ వార్డు లంకెలపాలెం హైస్కూల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. అనంతరం ఉత్తమ సేవలు అందిస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులను హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వెంకటరమణ తదితరులు



ఉత్తమ ఉపాధ్యాయుడిగా త్రినాథరావును సత్కరిస్తున్న నిర్వాహకులు



లంకెలపాలెం హైస్కూల్లో సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

● వడ్లపూడిలోని భవిత బుద్ధిమాంద్యం పిల్లల పాఠశాలలోని ఉపాధ్యాయులను, ప్రతిభ కనపర్చుతున్న బాలలను వైఎస్సార్‌సీపీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు పిన్నింటి సంతోష్, ఆడారి శ్రీను, చిత్రాడ రాజు, దాకా వరకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● 87వ వార్డు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్, మానవతా సేవా చారిటబుల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయ సిబ్బందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొండా జగన్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సుబ్బరాజు, ట్రస్ట్ ప్రతినిధి మడక అప్పలరాజు పాల్గొన్నారు.

ఇస్లాంపేటలో శాంతి ర్యాలీ

పెదగంట్యాడ: ఉక్కునగరం, కూర్మన్నపాలెం మానవత శాఖల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఇస్లాంపేటలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జి.ప్రమీల, ఉపాధ్యాయుడు ముజిహిల్ హక్‌ను సత్కరించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానవత గాజువాక యూనిట్ చైర్మన్ దీనంకొండ కృష్ణంరాజు, ఉక్కునగరం అధ్యక్ష, కార్యదర్శులు పడగల శ్రీనివాసరావు, ఎన్.సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న పెద్దాడ నూకరాజు



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న రుత్తల శ్రీనివాసరావు



అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులతో ఎస్ఎంసీ ప్రతినిధులు

మట్టి గణపతినే పూజిద్దాం

పెదగంట్యాడ: పర్యావరణ హితమైన మట్టి గణపతినే పూజిద్దామని గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు వైఎస్సార్ సీపీ కమిటీ సభ్యులు మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీను, ఇరోతి గణేష్ ఆధ్వర్యంలో కాకతీయ కూడలిలో 501 మట్టి గణపతి ప్రతిమలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి ప్రతిమల వినియోగంతో పర్యావరణానికి ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో తిప్పల దేవన్ రెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, ధర్మాల శ్రీనివాసరావు, భూలోక, అప్పలనాయుడు, తారక్, విఘ్నేష్ పాల్గొన్నారు.



వడ్లపూడిలో వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న నాగిరెడ్డి, తదితరులు

● దివ్యాంగుల నెట్‌వర్క్ కన్వీనర్స్ జీలకర్ర రమణ, భువనేశ్వరి ఆధ్వర్యంలో కోరాడ కూడలిలో మట్టి గణపతి ప్రతిమలు గురువారం పంపిణీ చేశారు. 76వ వార్డు కార్పొరేటర్ గంథం శ్రీనివాసరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, వైద్యాధికారి డాక్టర్ హేమలత పాల్గొన్నారు.

● జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరులో తాటికొండ కాశీ విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో కార్పొరేటర్ గంథం శ్రీనివాసరావు మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మంత్రి శంకరనారాయణ, ములగపాక అచ్చెంనాయుడు, రామచంద్రరావు, గోవింద్, సుదర్శన్ పాల్గొన్నారు.



ప్రతిమలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, దేవన్ రెడ్డి తదితరులు

రెండు వందల ప్రతిమల పంపిణీ

అగనంపూడి: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ విధిగా మట్టితో చేసిన వినాయక ప్రతిమలనే పూజించాలని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కోరారు. వైఎస్సార్‌సీపీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్ ఆధ్వర్యంలో వడ్లపూడిలో 2వందల మట్టి వినాయక ప్రతిమలను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. బొడ్డ సన్యాసిరావు, పిన్నింటి సంతోష్, దుగ్గపు నరసింహమూర్తి, అప్పని సన్యాసిరావు, ఆడారిశ్రీను, దాకా వరకృష్ణ పాల్గొన్నారు.

బాధితులకు విరాళాల సేకరణ



భెల్ గేటు వద్ద విరాళాలు సేకరిస్తున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు భెల్ (హెచ్‌పీవీపీ) సీఐటీయూ ప్రతినిధులు ఉద్యోగుల నుంచి విరాళాలు సేకరించారు. గురువారం సంస్థ ప్రధాన గేటు వద్ద సిటు నాయకులు రూ.18,660 సేకరించారు. ఈ సందర్భంగా సిటు ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్, ఎస్.జగన్నాథరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మానవతా దృక్పథంతో సహాయం చేయాలని కోరారు. సేకరించిన నగదుతో బాధితులకు సహాయం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కె.విజయ్‌కుమార్, సీహెచ్.నారాయణ, బి.కృష్ణమూర్తి జి.చిన్నబాబు, నారపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం



ట్యాంకర్‌తో నీరు అందజేస్తున్న ఎస్టీబీఎల్ ప్రతినిధులు


అక్కిరెడ్డిపాలెం: వరదలతో కకావికలమైన విజయవాడలోని సింగ్‌నగర్, పాయకాపురం, కండ్రిగ ప్రాంతాల్లో ఎస్టీబీఎల్ ప్రాజెక్ట్స్ అధినేత గుత్తికొండ బాలాజీ ఆర్థిక సహాయంతో ట్యాంకర్లతో మంచినీరు సరఫరా చేశారు. నీటి ముంపులో సైతం ట్యాంకర్లతో సిబ్బంది మంచినీరు సరఫరా చేసి వేలాది మంది బాధితులకు ఆసరాగా నిలిచారు. మూడు రోజుల నుంచి ముంపు బాధితులకు ఆహారం, తాగునీరు అందిస్తున్నారు.

● ఆటోనగర్ పారిశ్రామికవేత్తల ఆర్థిక సహాయంతో వాసీవా, పోవా, ఐలా ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు 15 వేల బ్రెడ్‌లు, 3 వేల బిస్కెట్ ప్యాకెట్లు గురువారం వ్యాను ద్వారా పంపించారు.

రోడ్డుపై ఇరువర్గాల కొట్లాట

కొత్త గాజువాకలో బీభత్సం సృష్టించిన సంజీవ్‌నగర్, శ్రీకాకుళం వాసులు

అక్కిరెడ్డిపాలెం: నిత్యం రద్దీగా వుండే గాజువాక రోడ్డుపై కొందరు బాహాబాహీకి దిగారు. రోడ్డుపై బీభత్సం సృష్టించడంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు హడలిపోయారు. అక్కడి దృశ్యం చూసిన వారు ఆటో డ్రైవర్లు ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్నారని ముందుగా అనుకున్నారు. ఆటోలో ప్యాసింజర్ల వల్ల డ్రైవర్ల మధ్య గొడవ పెరిగి ఉంటుందని భావించారు. అయితే ఆర్థిక లావాదేవీలే గొడవకు కారణమని పోలీసుల విచారణలో తేలింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక సంజీవ్‌నగర్‌కు చెందిన వాళ్లకి శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారు అప్పుగా ఇచ్చిన డబ్బులు అడగడానికి గురువారం గాజువాక వచ్చారు. ఇంతలో మార్గ మధ్యలోనే అప్పు తీసుకున్న వారు గాజువాక ఆంధ్రా బ్యాంక్ వద్ద శ్రీకాకుళం జిల్లా వారికి కనిపించడంతో... అక్కడే వారి మధ్య అప్పు చెల్లించే విషయమై మాటామాటా పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఇందులో ఒకరు ఆటో డ్రైవర్ కూడా ఉన్నారు. దాడి జరుగుతున్న సమయంలో ఆ ప్రాంతమంతా భయానకంగా మారింది. కాగా సంజీవ్‌నగర్‌కు చెందిన వారు ఈ గొడవపై న్యూపోర్టు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే గొడవ జరిగింది గాజువాక పోలీస్ స్టేషన్ పరిధి కావడంతో సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. గొడవపై పూర్తి స్థాయి సమాచారం లేకపోవడంతో ఇంకా కేసు నమోదు చేయలేదని పోలీసు అధికారులు తెలిపారు.



కొత్త గాజువాకలో కొట్టుకుంటున్న వ్యక్తులు